క్లుప్తంగా

గణనాథుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎస్సై మల్లికార్జునరావు

తాళ్లూరు: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నవరాత్రుల్లో భాగంగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. తూర్పుగంగవరం లక్ష్మీ గణపతి యూత్ ఆధ్వర్యంలో యువకులు దర్శి రోడ్డులో పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. దాతల సహకారంతో దాదాపు 5 వేల మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం వినాయకుని నిమజ్జనం నూతన రథంపై ఊరేగింపుగా నిర్వస్తున్నట్లు తెలిపారు. మండంలో ఉన్న భక్తులు, యువకులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సొసైటీ వైస్ చైర్మన్‌కు మెమో జారీ


సొసైటీని తనిఖీ చేస్తున్న ఇంద్రావతి

దర్శి: రైతులకు క్యాష్ మెమోను ఫాం–ఎం రూపంలో ఇవ్వనందున స్వయం సమృద్ధి సొసైటీ వైస్ చైర్మన్ ఫణిదపు వెంకట్రావుకు అధికారులు మెమో జారీ చేసినట్లు జిల్లా సహకార అధికారి ఇంద్రావతి తెలిపారు. రాజంపల్లి స్వయం సంవృద్ధి కో ఆపరేటివ్ సొసైటీని శుక్రవారం జిల్లా సహకార అధికారి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంద్రావతి మాటాడుతూ జిల్లాలో 14 సొసైటీల్లో మాత్రమే ఎరువుల వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల్లోని పంటల విస్తీర్ణం, రైతుల అవసరాల ఆధారంగా ఎరువులు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఎఫ్‌సీఓ ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం లైసెన్స్ కలిగిన షాపులో ఉండాల్సిన స్టాక్ రిజిస్టర్, ఇన్ వాయిస్‌లు పరిశీలించామన్నారు. ఏడీఈ బాలాజీ నాయక్, ఏఓ రాధ పాల్గొన్నారు.


కడపరాజుపల్లె వద్ద పొంగి పొర్లుతున్న తీగలేరు


దొంగలవాగు పొంగడంతో కొత్తూరు వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు

కళ్లెదుటే నీటి ప్రవాహం

- దాటాలంటే భయం..భయం
- లోలెవల్ కల్వర్టులతో అవస్థలు పడుతున్న ప్రజలు
- చిన్నదోర్నాల, కొత్తూరుల వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- వై.చర్లోపల్లి, గంటవానిపల్లెలకు దీర్ఘకాలంగా రహదారి సమస్య


గంటవానిపల్లె వద్ద స్తంభాల సాయంతో వాగు దాటుతున్న ప్రజలు (ఫైల్)

పెద్దదోర్నాల: చిన్నపాటి వర్షం కురిసినా లోలెవల్ కల్వర్టులు పొంగి పొర్లుతున్నాయి. ప్రజలు ఆ ప్రవాహాన్ని దాటి ఊరికి, పొలాలకు చేరాలంటే సాహసం చేయక తప్పడం లేదు. ఈ క్రమంలో వరదల్లో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా గతంలో చోటుచేసుకున్నాయి. ఇటీవల కల్వర్టుల ఎత్తు పెంచి వాటి స్థానంలో నూతనంగా బ్రిడ్జిలు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మండల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉన్న కల్వర్టుల్లో ప్రమాదకర కల్వర్టులను విస్మరించడంపై ప్రజల్లో విమర్శలకు తావిస్తోంది. ఇకపై అధికారులు అన్ని ప్రమాదకర కల్వర్టులపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకునే నాథుడేడి

వర్షం కురిస్తే తీగలేరు వాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో మార్కాపురం, దోర్నాల మార్గంలోని చిన్నదోర్నాల లోలెవల్ కల్వర్టుల వద్ద వరద ప్రమాదకరంగా ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఆ మార్గంలో ప్రయాణించే ఒంగోలు, తిరుపతి, నెల్లూరు, కడప, మైదుకూరు, బద్వేల్‌లు తదితర మార్గాల్లో ప్రయాణించే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో పాటు కర్నూల్,

గుంటూరు రహదారిలోని దొంగల వాగుపై దశాబ్దాల క్రితం నిర్మించిన లోలెవల్ కల్వర్టుల వద్ద సైతం వరదలు వస్తే అదే పరిస్థితి నెలకొని ఉంది. గతంలో ఓ వ్యక్తి వాగు దాటేందుకు ప్రయత్నించిన వరద ఉధృతికి నీటిలో కొట్టుకుపోయి మృతి చెందాడు. ఈ క్రమంలో వాహనాలు నల్లమలలోని మూడు ప్రాంతాల్లో దొంగలవాగును దాటాల్సి రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు వై.చర్లోపల్లి, గంటవానిపల్లె తదితర ప్రాంతాల్లో తీగలేరు పొంగితే ఇదే పరిస్థితి నెలకొని ఉంది. భారీ వర్షాలపై నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కొద్ది రోజుల క్రితం గ్రామానికి చెందిన యువకులు నీటి ప్రవాహాన్ని దాటేందుకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి తద్వారా ప్రమాదకర పరిస్థితుల్లో వాగు దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి ఆయా గ్రామాలకు రహదారి కష్టాలు తొలగించాలని కోరుతున్నారు.

సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు

దర్శి: సీఐటీయూ 13వ జిల్లా మహాసభల ప్రచారాన్ని ఉద్యోగులు, కార్మికుల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు పిలుపు ఇచ్చారు. దర్శిలో మండల కన్వీనర్ ఉప్పు నారాయణ అధ్యక్షన శుక్రవారం జరిగిన జిల్లా మహాసభల సన్నాహాక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కాలం సుబ్బారావు మాట్లాడుతూ పట్టణంలో మెదటిసారి జిల్లా మహాసభలు జరుగుతున్నాయని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజల వద్దకు వెళ్లి ప్రచారం చేయాలని కోరారు. కార్మిక వర్గ ఐక్యత, పోరాట లక్ష్యంతో 1970లో సీఐటీయూ ఆవిర్భవించి దేశంలోనే గుర్తింపు పొందిన పెద్ద కార్మిక సంఘంగా అభివృద్ధి చెందిందన్నారు. కార్మిక, ఉద్యోగుల హక్కుల కోసం దేశంలో 1991 నుంచి 24 సార్లు దేశవ్యాప్త సమ్మెలు జరిపిందని, కార్మికులకు ఉపాధి, వేతనాలు, 8 గంటల పనివిధానం, పీఎఫ్, ఈఎస్ఐ, పాత పింఛన్ విధానం అమలు చేయాలని పోరాటాలు చేస్తోందని, స్కీం వర్కర్స్ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, జీతం పెంపు, వయోపరిమితి, రాజకీయ వేధింపులు సమస్యలపై ఏ పార్టీ అధికారంలో ఉన్నా సమ్మెలు, పోరాటాలు చేసి సాధించుకున్నామన్నారు. ఆ పోరాట స్ఫూర్తితో మహాసభలను ఘనంగా నిర్వహించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్స్‌కు 9 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని, ఆ కార్మికులకు నెలకు ప్రభుత్వం రూ.6 వేలు కూడా ఇవ్వకపోతే ఎలా జీవిస్తారని, 15వ వేతన సంఘం నిధుల విడుదల నుంచి అన్ని పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇచ్చిన తర్వాతే ఇతర బిల్లులు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చే 3 వేల రూపాయల వేతనం పెంచాలని, మహిళలకు ఉచిత బస్సు పథకంతో నష్టపోతున్న ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం ద్వారా ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల సీఐటీయూ కన్వీనర్‌లు చిరుపల్లి అంజయ్య, విజయరాణి, బోడపాటి హనుమంతురావు, పంటా ఏడుకొండలు, వెంకట రమణలు ప్రసంగించారు. అంగన్‌వాడీ, ఆశా, ఎల్ఐసీ ఏజెంట్‌లు, మధ్యాహ్న భోజనం, ముఠా, వీఆర్ఏ, పంచాయతీ, గ్రీన్ అంబాసిడర్స్, బిల్డింగ్, ఆటో రంగాల కార్మికులు, మహిళా సంఘ నాయకులు అలూరి ఇస్మాయిల్, ఇత్తడి కోటయ్య, యోహోషువా, ఆరామ కోటిరెడ్డి, పార్వతి, నరసమ్మ, ఆదిలక్ష్మి, గుడిమెట్ల అదాం, రంగమ్మ, గంగయ్య పాల్గొన్నారు.

చంద్ర గ్రహణంతో ఆలయం మూసివేత

తాళ్లూరు: భక్తుల రాకతో గంగమ్మ తల్లి ఆలయం ప్రతీ ఆదివారం రద్దీగా ఉంటుంది. వచ్చే ఆదివారం చంద్ర గ్రహణం సందర్భంగా ఆలయం మధ్యాహ్నం మూడు గంటలకు మూసివేస్తున్నట్లు ఈవో గుంటుపల్లి వాసుబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులకు దర్శనం అవకాశం వేకువ జామున నుంచే కల్పిస్తున్నట్లు తెలిపారు.

యథావిధిగా సోమవారం తిరిగి ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం ఉంటుందని పేర్కొన్నారు.

కూటమి పాలనలో రైతులకు తీరని అన్యాయం


దర్శి: పోతవరంలో క్యూఆర్ కోడ్ ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


దొనకొండ: ఇండ్లచెరువులో..

దర్శి: కూటమి పాలనలో రైతులకు తీరని అన్యాయం జరిగిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా దేవవరం, పోతవరం, తానంచింతల గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం పర్యటించారు. హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం నిర్వాకాన్ని క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నిసార్లు అధికారంలోకి వచ్చినా రైతులను మోసం చేయడమే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రజలను మోసం చేయడం తప్ప చెప్పుకునేందుకు చేసిందేమీ లేదన్నారు. 143 హామీలు ఇచ్చి ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలను దారుణంగా మోసగించారన్నారు. రైతులు గ్రామాల్లో యూరియా కొరతతో అల్లాడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపాలిటీ వింగ్ ప్రధాన కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ రెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, నాయకులు కోరె సుబ్బారావు పాల్గొన్నారు.

దొనకొండ (కురిచేడు): ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపులు పక్కన పెట్టి ప్రజాసమస్యలపై దృష్టి సారించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాకర్ల కృష్ణారెడ్డి సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని ఇండ్లచెరువు, వెంకటాపురం గ్రామాల్లో శుక్రవారం రాత్రి బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు, నిరుద్యోగులకు భృతి కల్పిస్తామని ఎన్నికల హామీ ఇచ్చి నేడు అమలు చేయకుండా అందరినీ మోసం చేశారని గుర్తు చేశారు. మండల కేంద్రం దొనకొండలో ప్రభుత్వ భూములున్నా ఇండస్ట్రీలు ఏర్పాటు చేస్తామని ఐదేళ్లు మోసం చేశారని, ప్రస్తుతం ఏడాదిన్నర కాలమైనా ఒక్క కంపెనీ కూడా రాలేదని, బ్రిటీష్ కాలం నుంచి ఉన్న ఎయిర్‌పోర్టును పట్టించుకోలేదని విమర్శించారు. దొనకొండను ఇండస్ట్రియల్ కారిడార్ చేస్తే ఈ ప్రాంత ప్రజలకు జీవన భృతి లభిస్తుందని, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని, ఎన్నికల సమయంలో నోటికొచ్చిన హామీలన్నీ ఇచ్చి గద్దెనెక్కిన వెంటనే వాటిని మర్చిపోవటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని పేర్కొన్నారు. మోసం చేయడంలో చంద్రబాబుకు సాటి మరెవరూ లేరని ఎంపీపీ బొరిగర్ల ఉషా మురళి దుయ్యబట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యాక్టివిటీ సభ్యుడు బత్తుల వెంకట సుబ్బయ్య, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ కాలూరి రమణయ్య, షేక్ రసూల్, ఇండ్లచెరువు సర్పంచి ఐలూరి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచి పాతకోట కోటిరెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు పత్తికొండ వెంకట సుబ్బయ్య యాదవ్, ఎంపీటీసీ చిన్న కోటమ్మ, కాశిరెడ్డి, పాతకోట సునీతరెడ్డి, మూడమంచు కృష్ణమూర్తి, గుమ్మ కృష్ణమూర్తి, మూడమంచు శివయ్య మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఎనిబరి మనోహర్‌రాజు, గడ్డం రామాంజనేయులు, బొరిగర్ల ఏడుకొండలు, సింబోతు బాల గురవయ్య, ముప్వా ఆదినారాయణ, శ్రీరాంప్రసాద్, కొంగలేటి నతానియేలు, కొంగలేటి ఏసులు, రాయని వెంకట్రావు పాల్గొన్నారు.

దర్శి కృషి విజ్ఞాన కేంద్రానికి

ద్వితీయ పురస్కారం


అవార్డు అందుకుంటున్న డాక్టర్ రమేష్

దర్శి: పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం ద్వితీయ పురస్కారంగా ఎంపికైనట్లు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ భారతీయ పరిశోధన మండలి, వ్యవసాయ సాంకేతిక అనే ప్రయోగ సంస్థ అటారి జోన్–10, హైదరాబాద్ తరఫున 2024–25 సంవత్సరానికి, అటారి జోన్–10 జోన్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, తెలంగాణ రాష్ట్రాల్లో 72 కృషి విజ్ఞాన కేంద్రాల్లో దర్శి కృషి విజ్ఞాన కేంద్రానికి ద్వితీయ పురస్కారం లభించింది. ద్వితీయ పురస్కారం సంవత్సరం కృషి విజ్ఞాన కేంద్రంలో చేపట్టిన క్షేత్రస్థాయి పరిశీలనలు, ప్రథమ శ్రేణి పరిశీలనలు రైతు శిక్షణ కార్యక్రమాలు, భూసార పరీక్షలు, సామూహిక ప్రథమ శ్రేణి పరిశీలనలు, విత్తనాలు తయారు చేసి రైతులకివ్వడం, నారు మొక్కలు పెంచి రైతులకివ్వడం, భూసారం పెంచే పద్ధతులు వంటి అంశాలపై ద్వితీయ పురస్కారం లభించినట్లు వెల్లడించారు. ఈ నెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అటారి జోన్–10 కింద ఉన్న 72 కృషి విజ్ఞాన కేంద్రాల్లో దర్శి కృషి విజ్ఞాన కేంద్రానికి ద్వితీయ స్థానం లభించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. వైస్ చాన్సలర్ డాక్టర్ భారతి, అటారి డైరెక్టర్ డాక్టర్ షేక్ మీరా, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ పురస్కారం రావడానికి కృషి చేసిన ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ, వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ దుర్గాప్రసాద్, కేవీకే సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

జీఎస్టీ తొలగించడంపై హర్షం

మార్కాపురం: జీవిత బీమా, ఆరోగ్య బీమా పథకాలపై జీఎస్టీని రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు, జిల్లా వినియోగదారుల పరిరక్షణ కమిటీ సభ్యుడు ఓరుగంటి మల్లిక్ హర్షం వ్యక్తం చేశారు. ఆరోగ్య బీమా పథకాలపై జీఎస్టీ రద్దు చేయాలని పలుసార్లు కేంద్ర, రాష్ట్ర వినియోగదారుల సమావేశాల్లో డిమాండ్ చేశామన్నారు. ఇటీవల ఈ విషయంపై జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య తరఫున జాతీయ వినియోగదారుల కోరంలో కేసు ఫైల్ చేశారు. ఈలోపే కేంద్ర ప్రభుత్వం ఇలాంటి పథకాలపై జీఎస్టీని తొలగించడం మంచి పరిణామమన్నారు. నిత్యావసరాలపై 18 నుంచి 5 శాతానికి జీఎస్టీ తగ్గించడం సంతోషించదగిన విషయమన్నారు.


తాళ్లూరు: అవార్డు అందుకుంటున్న వైఎస్సార్‌కే ప్రసాద్


కురిచేడు: స్వాతిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే బీఎన్, జేసీ


ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంఈఓలు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

పెద్దారవీడు: ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైందని, జాతి నిర్మాతలను తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎంఈఓ–1 ప్రగఢ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని దేవరాజుగట్టు సమీపంలో కాశినాయన ఆశ్రమంలో మండల ఉపాధ్యాయ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఈఓ–2 సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నిచ్చెన లాంటిదని, ఒక్కో మెట్టు ఎక్కి పైకి చేరుకోవాలన్నారు. సీనియర్ ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీరాములు మాట్లాడుతూ విద్యార్థుల్లోని అజ్ఞానం అనే చీకటిని తొలగించి విజ్ఞానను అనే జ్యోతిని వెలగించేది ఉపాధ్యాయులేనన్నారు. మండల స్థాయిలో 9 మంది ఉత్తమ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు 2, రెండు ఉత్తమ పాఠశాలలను ఎన్నుకొని వారికి శాలువా, పూలమాలతో సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు షేక్ రజూల్, ఓ.గాలెయ్య, జి.చంద్రశేఖర్, పి.ప్రభాకర్, యు.వెంకట్రావు, ఆర్‌బీపీ శ్రీనివాస్, బి.చెన్నారెడ్డి, కాశినాయన ఆశ్రమం అధ్యక్షుడు ఎం.రామిరెడ్డి, గౌరవధ్యక్షుడు వై.వెంకటరెడ్డి, వై.వేణుగోపాలరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొనకొండ (కురిచేడు): స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ నానీ ఆధ్వర్యంలో టీచర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నానీ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం టీచర్స్ డేగా జరుపుకుంటారన్నారు. ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆయన ఉపరాష్ట్రపతి వరకు వెళ్లారని, ఉత్తమ ఉపాధ్యాయుడిగా అందరి మన్ననలు పొందారని, ప్రతి ఉపాధ్యాయుడు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ నానీ పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాలలో పనిచేస్తున్న ఉత్తమ అధ్యాపకులకు బహుమతులు ప్రదానం చేశారు. టీచర్స్ డే సందర్భంగా విద్యార్థులు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థినులు పలు రకాల వంటకాలు తయారు చేసుకొచ్చి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పెట్టారు. అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వర్‌రెడ్డి, విక్టోరియా పాల్గొన్నారు


దొనకొండ: సర్వేపల్లికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కురిచేడు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా వల్లెం స్వాతి ఎంపికైంది. మండలంలోని పొట్లపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న స్వాతి జిల్లాస్థాయిలో ఎంపిక కావటంపై పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఆమెను గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం స్పందన హాలులో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, డీఈఓ కిరణ్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత, సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్ విజయకుమార్‌లు ఘనంగా సన్మానించారు.

తాళ్లూరు: జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా తూర్పు గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వైఎస్సార్‌కే ప్రసాద్ ఎంపికయ్యారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఒంగోలు కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన అవార్డుల పంపిణీ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల్‌కృష్ణ చేతుల మీదగా అవార్డు అందుకున్నారు. దర్శిలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసిన సభలో బొద్దికూరపాడు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సన్నపురెడ్డి, అంజిరెడ్డిని సన్మానించి అవార్డులు అందించారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన సర్వేపల్లి

యర్రగొండపాలెం: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశ ప్రథమ పౌరుడిగా అంకిత భావంతో పనిచేసి ఉపాధ్యాయ వృత్తికి వన్నె తీసుకొచ్చారని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక శివాలయం ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు తమ వృత్తికి న్యాయం చేసి విద్యార్థులను మహోన్నత స్థాయికి తీసుకెళ్లే విధంగా కృషి చేయాలన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు ఎస్.చంద్రకళ, బి.స్వప్నగాయత్రి, కె.లక్ష్మి, ఎం.సునీల, జి.ప్రవీణ్, షేక్ అబ్దుల్ రహిమాన్, ఎం.ఫణిభార్గవి, షేక్ అన్సారీ, వి.నాగేశ్వరరావు నాయక్, పి.రాజేష్, జి.వీరయ్యలను మాజీ విద్యాకమిటీ చైర్మన్ గోళ్ల వీరవెంకట సుబ్బారావు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రిటైర్డ్ హెచ్‌ఎం, టీచర్లు ఎంఐ ప్రసాద్, అమరసింగ్ నాయక్, మస్తాన్‌రావు, శంకర్‌రెడ్డిల గృహాల వద్దకు ఎంఈవోలు వెళ్లి వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో–2 మల్లూనాయక్, పీటీఎల్‌యూ నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మా రాజయ్య, యూటీఎఫ్, ఏపీ టీఎఫ్ నాయకులు పబ్బిశెట్టి రవికుమార్, ఎం.శ్రీనివాసులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో అంజనేయులు, ఇతర అధికారులు